క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా


హనుమాన్ చాలీసా నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఉండి కొత్తపేటలో హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధతో నిర్వహించారు. కొత్తగా నిర్మించిన కొత్తపేటలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే వంతెనపై సుమారు 3 వేల మందికి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ నాయకుడు నల్లా ప్రసాద్, అంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమాన్ పారాయణం చేశారు. కార్యక్రమంలో గుండాబత్తుల సుబ్బారావు, ఎంపీటీసీ కునుకు శ్రీను, ఆలగరి సత్యానంద్, డాక్టర్ బాలం శ్రీనివాస్, మహిళా సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు చొరబడుతున్నాయ్ !


ప్రధాన సెంటర్‌లో విచ్చలవిడిగా కుక్కలు

ఆకివీడు: పట్టణంలోని పలు వీధుల్లో గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తుంటే, పట్టణంలోనూ, గ్రామాల్లో చొరబడుతున్న కుక్కలు ప్రజలపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి పూట వివిధ ప్రాంతాల నుంచి మినీ లారీల్లో కుక్కలను తీసుకొచ్చి సమీప పట్టణం, గ్రామాల్లో వదిలి వెళ్లిపోతున్నారు. అవి వీధుల్లో స్వైర విహారం చేస్తూ పలువురిని గాయ పరుస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలో తెలియక ఆయా పంచాయతీల అధికారులు వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి వదిలి వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల స్థానిక సంతపేటలోనూ, చెరుకుమిల్లి గ్రామంలో కుక్కల దాడికి చిన్న పిల్లలు గాయాలపాలైన విషయం విధితమే. పట్టణంలో పెరిగిపోతున్న కుక్కలకు కుటుంబ నియంత్రణ ఇంజెక్షన్లు ఇవ్వాలని అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. దీంతో కుక్కల సంతతి రోజు రోజుకూ పెరిగిపోతుంది.

ఉమాసోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణ ఉమా సోమేశ్వరస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో సోమేశ్వర జనార్ధన స్వామికి మంగళవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆంజనేయస్వామికి కార్తీకమాస ప్రత్యేక పూజలు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కాళ్ల: మండలంలోని మాలవానితిప్ప గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఏటా కార్తీకమాసంలో నిర్వహించే వేడుకకు సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు, గ్రామ పెద్దలతో కలిసి ఆలయంలో వైభవోపేతంగా ఏర్పాట్లు చేశారు. దీప ప్రతిమల వెలుగులో అభయాంజనేయస్వామి ఆలయం దేదీప్యమానంగా వెలిగింది. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరాజు సుబ్బరాజు, మాజీ సర్పంచ్ మంతెన వెంకటరాజు, మంతెన రంగరాజు, పెద్దలు, యువత పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ పనుల ప్రతిపాదనలపై సమావేశం

మొగల్తూరు: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులను ప్రతిపాదించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు.

వంతెనలు ఇలా.. ప్రయాణించేది ఎలా?


శిథిలావస్థకు చేరిన ఉండి కాలువపై వంతెన


పురాతన వంతెనకు బయటకు వచ్చిన ఐరన్ చువ్వలు

- శిథిలావస్థకు చేరిన వంతెనలు
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో వాహనదారులు

ఉండి: కాలువపై 165వ జాతీయ రహదారిపై ఉండి సెంటర్‌లో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఎన్నో ఏళ్ల నుంచి స్థానికులు, వాహనదారులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. జాతీయ రహదారిపై ఇంతటి పురాతనమైన వంతెన ఉండటంతో పాటు క్షీణదశకు చేరుకోవడంతో భయభ్రాంతులకు గురి చేసే అంశం. సాధారణ రోడ్లలో వంతెనలు ఇబ్బందికరంగా ఉంటేనే భయపడిపోతాం. అటువంటిది జాతీయ రహదారిపై ఇటువంటి వంతెన ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సానికులు ఆందోళన చెందుతున్నారు. జాతీయ రహదారిపై ప్రతి రోజు వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఉండి సెంటర్ జంక్షన్ కావడంతో వాహనాల రద్దీ రోజు రోజుకు మరింగా పెరిగిపోతుంది. భీమవరం నుంచి ఉండి మీదుగా తాడేపల్లిగూడెం, జంగారెడ్డి గూడెం, ఏలూరు, గుడివాడ, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఉండి సెంటర్ జంక్షన్‌గా ఉంది. అలాగే పెద్ద సంఖ్యలో స్కూల్ బస్సులు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు ప్రతి రోజూ ప్రయాణాలు సాగిస్తాయి. ఇటువంటి ప్రాధాన్యత ఉన్న ప్రాంతంలో ఉండి పెద్ద కాలువపై వంతెన శిథిలావస్థకు చేరింది. అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రమాదపుటంచున ఉన్న ఉండి పెద్ద వంతెనను పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోపల్లె వంతెన

ఉండి సెంటర్‌లోని వంతెన మాదిరి కోపల్లె వంతెన కూడా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. బొండాడ మేజర్ డ్రెయిన్‌పై భీమవరం జువ్వలపాలెం రోడ్డులో ఉన్న ఈ వంతెన సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించారు. జువ్వలపాలెం రోడ్డు అంటేనే భారీ ట్రాఫిక్‌కు పేరుగాంచింది. అయితే వంతెన ఇరుకుగా ఉండటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బొండాడ మేజర్ డ్రెయిన్‌పై వంతెనను పునర్నిర్మించాలి.

గరగపర్రు వంతెన

పాలకోడేరు మండలం గరగపర్రు వంతెన కూడా ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఈ వంతెన సుమారుగా 50 ఏళ్ల క్రితం నిర్మించారు. దీనికి కనీసం సరైన రెయిలింగ్ కూడా లేకపోవడంతో వాహనదారులు వంతెనపై నుంచి వెళ్లేందుకు గడగడలాడిపోతున్నారు. ఉండి కాలువపై అత్యంత ప్రమాదకరంగా ఉన్న వంతెనపై వాహనం అదుపు తప్పితే ఇక అంతే సంగతులు. దీనిపై అధికారులు వెంటనే దృష్టి సారించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి



ఎప్పుడో 50 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన ప్రస్తుతం సరిపోవడం లేదు. దీనితో పాటు వంతెన క్షీణదశకు చేరుకుంది. కొత్తవంతెన నిర్మిస్తే చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం పెరిగిన ట్రాఫిక్‌తో వంతెన వల్ల ఉండి సెంటర్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని భయపడుతున్నాం.

– గుండాబత్తుల సుబ్బారావు, ఉండి

ప్రమాదం జరగక ముందే మేల్కోవాలి



ఎన్నో ఏళ్ల నాటి వంతెన పైగా కూలిపోయేలా ఉంది. ఏదైనా ఆర్టీసీ లేదా స్కూల్ బస్సు వెళుతున్నప్పుడు ఘటన జరిగితే ఏంటి పరిస్థితి. అందుకే ఏ ప్రమాదం జరగక ముందే అధికారులు మేల్కోవాలి. కొత్త వంతెన నిర్మించి ట్రాఫిక్ సమస్యను, వాహనదారుల ఇబ్బందులను పరిష్కరించాలి.

– రాయి సతీష్, ఉండి

విద్యార్థులకు బహుమతులు


భీమవరంలో పీఎస్ఎం స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భారతరాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు కాకినాడలో నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో భీమవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని స్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ చెప్పారు. మంగళవారం విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో అనిత, లోకేశ్వరి, రమావతిలు బహుమతులు గెల్చుకున్నారన్నారు.

రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలి

మొగల్తూరు: వాతావరణంలో మార్పులు కారణంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు పండించిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని ఆర్డీఓ డి.రాజు సూచించారు. మంగళవారం మొగల్తూరులోని రైతు సేవా కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి అధికారులు, రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. కోతలు కోసే సమయం ఉంటే గనుక పంట కోతను వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ధాన్యం అమ్మిన 48 గంటలలోపు వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తుందన్నారు. ఆయన వెంట ఏడీఏ అనిలకుమారీ, ఏఓ అబ్దుల్ రహీమ్, తహసీల్దార్ కె.రాజకిషోర్, సీఎస్ డీటీ సంధ్య, వీఆర్వో డి.సత్యనారాయణ తదితరులున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్


భీమవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


భీమవరంలో రాజ్యాంగ దినోత్సవ సభలో మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: ప్రతి భారతీయుడు దేశ రాజ్యాంగం గూర్చి పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమవరం పట్టణంలో వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు డి రామనాగేశ్వరరావు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా అందరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు వస్తున్నాయంటే అది రాజ్యాంగం గొప్పతనమేనన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలలో..

డీఎన్నార్ లా కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం విలువల గురించి వివరిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణంలో కృషి, దేశ నాయకుల త్యాగాలు మరొవలేనివన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, అధ్యాపకులు చెల్లబోయిన రంగారావు, భాస్కరరావు, వాణి, రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమరసత వేదిక, ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో..

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగమని సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. భీమవరంలో మంగళవారం సామాజిక సమరసత వేదిక, ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య, నీలాతి రమేష్, గూడూరు సాంబమూర్తి, సూర్యనారాయణ, జె వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌరులంతా భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

భీమవరం: చట్టాలన్నీ రాజ్యాంగానికి లోబడి రూపొందించబడతాయని ప్రతి పౌరుడు భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని భీమవరం మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం ఎ సోమశేఖర్ అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్‌బాబు, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి ధనరాజు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె వెంకట్రావు, న్యాయవాదులు ఆండ్రూస్, సుందర్రావు, కట్టా ప్రసాద్, సత్య విజ్ఞాన దేవి, యూవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మభ్యపెడితే చర్యలు


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

భీమవరం అర్బన్: వాతావరణ మార్పుల కారణంగా ఒబ్బిడి చేసుకున్న ధాన్యాన్ని రైతులు రైతు సేవాకేంద్రాలకు తరలించాలని ఏడీఏసీమెచ్ శ్రీనివాస్ సూచించారు. భీమవరం మండలంలో చిన అమీరంలో మంగళవారం ధాన్యం కల్లాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మరో మూడు రోజుల వరకు వాయిదా వేసుకోవాలన్నారు. ధాన్యం విక్రయంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని హితవు పలికారు. మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా ధాన్యం విక్రయాల్లో రవాణా ఖర్చులు, హమాలి చార్జీలు చెల్లిస్తుందన్నారు. ధాన్యం విక్రయంలో ఏ సమస్యలు ఉన్నా రైతు సేవ కేంద్రం సిబ్బందిని, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా జీతాల్లేవ్

ఆకివీడు: మండలంలోని చినకాపవరం గ్రామ సచివాలయ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ డీడీఓ బదిలీపై వెళ్లడంతో సీఎఫ్ఎంఎస్‌కు జీతాల బిల్లును లాగిన్ చేసేందుకు అవకాశం లేకపోవడంతో గత నెల జీతాలు నిలిచిపోయాయి. విజయవాడ నుంచి డీడీఓ ప్రసాద్ బదిలీపై ఆకివీడు మండలం వచ్చారు. ఆయనను చినకాపవరం, అయిభీమవరం గ్రామాల కార్యదర్శిగా నియమించారు. అయితే జీతాల బిల్లు డ్రా చేసేందుకు ఆయన ఎల్‌పీసీని మండల పరిషత్‌కు దాఖలు చేయలేదని తెలిసింది. దీంతో ఆయనకు జీతాల బిల్లు లాగిన్ చేసే అవకాశం లేకుండా పోయిందని చెబుతున్నారు. రెండు నెలలుగా సచివాలయ సిబ్బంది జీతాల్లేక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు.

సీహెచ్‌సీ స్వీపర్లకూ జీతాల్లేవు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో పని చేస్తున్న ఎనిమిది మంది స్వీపర్లకు గత రెండు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా సీహెచ్‌సీలో పని చేస్తున్న తమకు కేవలం ఐదు వందలు ఇచ్చేవారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తమకు రూ.12 వేలు జీతం ఒక్కసారిగా పెంచి, తమను ఆదుకున్నారన్నారు. గత ఐదేళ్లుగా జీతాలు ప్రతీ నెలా చెల్లించేవారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మాకు జీతాలు లేటవుతున్నాయని వారు వాపోతున్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై చిత్రాల ప్రదర్శన


ఎయిడ్స్ నియంత్రణపై చిత్రాల ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఆకివీడు: ఎయిడ్స్ వ్యాధి చరిత్ర, వ్యాప్తి, నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు పలు రకాల చిత్రాలు గీసి ప్రదర్శించారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులచే అవగాహనా దృశ్యాలను చిత్రీకరింపజేశారు. పలువురు విద్యార్థులు గీసిన వివిధ చిత్రాలు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వారం రోజుల పాటు కార్యక్రమాలను చేపట్టే విధంగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయ కర్త డాక్టర్ టి.ఓగేశ్వరరావు, అధ్యాపకులు కె.సామ్యూల్, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిని నియంత్రించాలి


షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆకివీడు: షుగర్ వ్యాధిని నియంత్రించుకోవాలని ప్రముఖ వైద్యులు, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు (ఎంవీఎస్) అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయం వద్ద మంగళవారం షుగర్ నిర్ధారణ పరీక్షలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంవీఎస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులు నియంత్రణకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఐఎంఏ వైద్యులు డాక్టర్ మొహ్మద్ బిలాల్ మాట్లాడుతూ నడక, వ్యాయామం ద్వారా షుగర్ వ్యాధికి దూరంగా ఉండొచ్చన్నారు. ఎంవీఎస్, బిలాల్‌తో పాటు డాక్టర్ బి.శివ రామకృష్ణంరాజు రోగులను పరీక్షించి, వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు బి.నర్సింహం, జీవీఎస్ఎస్ నారాయణరాజు, ఎంవీ సుబ్బరాజు, వి.చిలకారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం


దీపాలంకరణలో బాలత్రిపుర సుందరీదేవి

భీమవరం(ప్రకాశంచౌక్): కార్తీక ఏకాదశి సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని బాల త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి రుద్రాక్షలతో ప్రత్యేక పూజలు, కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పట్టణానికి మద్దాల సత్యనారాయణ దంపతులు, వలవల శ్రీనివాస్ దంపతులచే అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రపంచానికి ఆదర్శం మన రాజ్యాంగం


ఆకివీడు: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


పాలకోడేరు: పెన్నాడ ఇంజనీరింగ్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు


ఉండి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడు


భీమవరం: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి


కాళ్ల: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

ఆకివీడు: మన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని, పలు దేశాలు మన రాజ్యాంగం అమలుకు ప్రయత్నిస్తున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళ్ల: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తహసీల్దార్ సుందర్‌సింగ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఆర్ఐ లక్ష్మీ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, ఉపాధ్యాయులు ఏవీ సుబ్బరాజు, బీఆర్ఎంకే స్వామి, విజయలక్ష్మి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి: ప్రపంచ దేశాలకు తలమానికంగా భారత రాజ్యాంగం తీర్చిదిద్దబడటం మన దేశానికి గర్వకారణమని మాలమహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడు చిగురుపాటి రాజేష్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం వెలివర్రు, ఉండి లైబ్రరీలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంబెద్కర్ విగ్రహానికి మాలమహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఈలి రవి, యలమదుర్తి రాజభూషణ,ఈలి కృపాదానం,కోనాల స్టీఫెన్,పిల్లి పాల్‌రాజ్,పాతలపాటి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళీకృష్ణ మాట్లాడుతూ 2015వ సంవత్సరం నుంచి నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏబీఎస్ఆర్ మనోహర్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ కొప్పర్తి రాగిణి, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగం గొప్పదనం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

భీమవరం: అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించి దాని గొప్పదనం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, తహసీల్దార్ రావి రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.